# గుడ్డం కోనేరు పరిశీలన



ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురం పట్టణంలో స్థానిక గుడ్డం కోనేరును శనివారం మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్, ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి వీరయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ, త్వరలో జరగనున్న గణేష్ నిమజ్జనం కోసం గుడ్డం కోనేరును ఇప్పటి నుండే పరిశుభ్రత పనులు చేపడుతున్నామని తెలిపారు. కోనేరులో ఉన్న చెత్త చెదారాన్ని తీసి, కోనేరును పూర్తిగా నీటితో నింపి, త్వరితగతిన పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వినాయక విగ్రహాల నిమజ్జనానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీర్ దస్తగిరి, సచివాలయ ఎమ్యూనిటీ కార్యదర్శి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## బాబు షూరిటీ మోసం గ్యారంటీ పై మండలంలో విస్తృత ప్రచారం.

### టిడిపికి ప్రజలే బుద్ధి చెబుతారు.వైకాపా నియోజకవర్గ ఇన్చార్జి దీపిక.



ప్రజా భూమి, లేపాక్షి

మండల పరిధిలోని కల్లూరు,కొండూరు, మానేపల్లి పంచాయితీ గ్రామాల్లో శనివారం మండల వైకాపా కన్వీనర్ నిసార్ అహ్మద్ ఆధ్వర్యంలో బాబు షూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో హిందూపురం నియోజకవర్గం వైకాపా ఇంచార్జ్ దీపిక ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాబు షూరిటీ మోసం గ్యారంటీ కరపత్రాలను ఇంటింటా పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎన్డీఏ ప్రభుత్వం పాలనలోకి వచ్చి ఏడాది కాలం గడిచినా ఎన్నికల్లో బాబు ఎక్కిన హామీలను మాత్రం ప్రజలకు అమలు చేయలేదన్నారు. ఎన్నికల ముందు అధికారం కోసం పలు హామీలను ఇచ్చి మరచిన చంద్రబాబుకు ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. సూపర్ సిక్స్ పథకాలు 100% అమలు చేయాలని డిమాండ్ చేశారు. బాబు మాటలు నమ్మి ఓటు వేసిన అన్ని వర్గాల ప్రజలు బాబు మోసాన్ని ఇప్పుడు గుర్తించారన్నారు. రాబోయే ఎన్నికల్లో ఎన్డీఏ ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారని దీపిక పేర్కొన్నారు. కార్యక్రమంలో వైకాపా నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## లేపాక్షి ఆలయాన్ని సందర్శించిన కర్ణాటక గవర్నర్ పీఎస్ పంకజ్ కుమార్



ప్రజా భూమి, లేపాక్షి

శిల్పకళారామంగా పేరు అందిన లేపాక్షి వీరభద్రాలయాన్ని శనివారం కర్ణాటక గవర్నర్ వ్యక్తిగత కార్యదర్శి పంకజ్ కుమార్ మెహతా సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలోని శాసనాలు, చవితి వినాయకుడు, అసంపూర్తి కళ్యాణ మండపం, లతా మంటపం, నాట్యమండపం లోని శిల్పాలు, తైలవరణ చిత్రాల చరిత్రను తెలుసుకున్నారు. వ్రేలాడే స్తంభం విశిష్టతను తెలుసుకున్నారు. దుర్గాదేవి వీరభద్ర స్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం లేపాక్షి వీరభద్రాలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కరణం రమానందన్ ఆలయ మర్యాదలతో సత్కరించారు.

## టిడిపి తోనే అన్ని వర్గాల సంక్షేమం



ప్రజాభూమి, హిందూపురం టౌన్

తెలుగుదేశం పార్టీతోనే అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధి సాధ్యమవుతుందని టిడిపి పార్టీ మండల అధ్యక్షులు హెచ్ఎన్ రాము పేర్కొన్నారు. శనివారం తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'సుపరిపాలనకు తొలి అడుగు' కార్యక్రమాన్ని రాము ఆధ్వర్యంలో రూరల్ మండలం చౌళూరు పంచాయతీలో నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటింటికి వెళ్ళి ఈ ఏడాది పరిపాలనలో కూటమి ప్రభుత్వం అందించిన పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ అశ్వర్థ నారాయణ రెడ్డి, అరుణాచల రెడ్డి, మాజీ జడ్పీటీసీ ఆదినారాయణ, ఐటీడీపి రామాంజి, శ్రీరాములు, ప్రదీప్, సర్పంచ్లు చెక్కిరప్ప, మంజు, హనుమంతు, టి జి నాగరాజు, ఉమాశంకర్ రెడ్డి, ఎంపీటీసీ శివ, మాజీ ఎంపీటీసీలు అంజి, ప్రకాష్, రామచంద్ర, శంకర్, మదన్ గోపాల్ రెడ్డి, అంజిన్ రెడ్డి, రషీద్, వెంక టరమణప్ప, బాబు, అది నారాయణప్ప, నగేష్, భరత్ స్వామి, మల్లప్ప, శివప్ప, మూర్తి, వేణు, నంజుండప్ప పాల్గొన్నారు.


## దశాబ్దాల రహదారి సమస్య పరిష్కారం



ప్రజాభూమి, ముదిగుబ్బ

గుంజేపల్లి పొలంలో మూడు దశాబ్దాలుగా నెలకొన్న రహదారి సమస్య శనివారంతో పరిష్కారమైంది. గుడ్డంపల్లి తండా రోడ్డు నుండి ముదిగుబ్బ రైతుల పొలాలకు వెళ్లేందుకు రహదారి ఏర్పడ్డ సమస్యను తహశీల్దార్ నారాయణస్వామి ధర్మవరం ఆర్డీవో మహేష్ ఆదేశాలతో పరిష్కరించారు. గ్రామ సర్వేయర్లతో కొలతలు తీయించి రహదారికి హద్దుల రాళ్లు నాటించారు. వెంటనే యంత్రాలతో రోడ్డును చదును చేసుకోవాలని రైతులకు తహశీల్దార్ సూచించారు. దీంతో పలువురు రైతులు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ భాస్కరరెడ్డి, ఎస్సై బాలనాయక్, వీఆర్ఏ ప్రసాద్, రైతులు పెద్దన్న, గుర్తినంద కుమార్, సునీల్, నరేంద్ర, శ్రీనివాసులు, వెంకటేష్, నారాయణప్ప, శేఖర్ తదితరులు ఉన్నారు.

## ఘనంగా శ్రావణమాసం పూజలు




ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురం పట్టణంలో వెలసిన వివిధ దేవాలయాల్లో శనివారం శ్రావణమాసాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని పేట వెంకటరమణ స్వామి, సూగూరు ఆంజనేయ స్వామి, వేణుగోపాల స్వామి, దక్షిణామూర్తి తదితర దేవాలయాల్లో ప్రత్యేక పూజలను నిర్వహించారు. శ్రావణమాసం తొలి శనివారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో దేవాలయానికి తరలివచ్చారు. దేవాలయాల్లో మూల విరాట్లను వివిధ రకాల ఆభరణాలు, పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి వేద పండితులు మంత్రోచ్చారణ నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహా మంగళహారతి అనంతరం భక్తులకు తీర్థ, ప్రసాద వినియోగం చేశారు. భక్తులతో దేవాలయాలు కిటకిటలాడాయి.

# పేదల అభివృద్ధి పి 4 పాలసీ ప్రధాన లక్ష్యం.జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్.

### బంగారు కుటుంబాలు, మార్గదర్శకులను వేగవంతంగా గుర్తించండి.

ప్రజాభూమి, లేపాక్షి:



పేదల అభివృద్ధి పి 4 ప్రధాన లక్ష్యమని సత్య సాయి జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని కంచి సముద్రం గ్రామంలో పి4 సర్వే పై నిర్వహించిన గ్రామసభలో కలెక్టర్ టీఎస్ చేతన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు . ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, బంగారు కుటుంబాలు, మార్గదర్శకులను వేగవంతంగా గుర్తించి వెంటనే ఆన్లైన్ లో నమోదు చేయాలని అధికారులకు సూచించారు. పి 4 పాలసీ ద్వారా పేదల జీవితాల్లో మార్పులు తీసుకువచ్చేందుకు కృషి చేయాలన్నారు. పేదల్లో మార్పు వచ్చిన రోజునే గ్రామ అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. గ్రామంలోని విద్యావంతులు, ఎన్నారైలు, ఉపాధ్యాయులు, సంపన్నులు అన్ని వర్గాల వారు పి 4 సర్వేలో భాగస్వాములై పేదరిక నిర్మూలనకు సహకరించాలన్నారు. పి ఫోర్ పాలసీ క్రింద బంగారు కుటుంబాల దత్తత, మార్గదర్శకులు ఎంపిక, లబ్ధిదారుల నమోదు కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. విద్యా, ఆరోగ్యం,ఆర్థిక రంగాల్లో వెనుకబడిన వారికి చేయూత నిస్తూ, వారిని ఉన్నత స్థితికి తీసుకువెళ్లేందుకు కృషి చేయాలి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేదరిక నిర్మూలనను ముఖ్య లక్ష్యంగా చేసుకుని జీరో పావర్టి పి 4 పాలసీని అమలు చేసేందుకు కృత నిశ్చయంతో ఉన్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. 20 శాతం అట్టడుగున ఉన్న పేద కుటుంబాలను, అత్యున్నతంగా ఉన్న 10 శాతం సంపన్నుల సహకారంతో అభివృద్ధి చేయడం ఈ పాలసీ ముఖ్య ఉద్దేశం అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగ లక్ష్మమ్మ, తహసిల్దార్ సౌజన్య లక్ష్మి, ఎంపీడీవో నరసింహమూర్తి, కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఓల్డ్ టౌన్ మార్కెట్ ను పీపీపీ మోడల్ లో పునర్నిర్మిస్తాం

### సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి పాల్గొన్న అబ్జర్వర్లు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, లక్ష్మీనారాయణ

ప్రజాభూమి, అనంతపురము ప్రతినిధి



నగరంలోని ఓల్డ్ టౌన్ మార్కెట్ ను పిపిపి మోడల్ లో పునర్నిర్మాణం చేయబోతున్నట్లు అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. గత వైసిపి ప్రభుత్వంలో మార్కెట్ విషయంలో మాట ఇచ్చి తప్పారని, ఇప్పుడు ఆ మార్కెట్ ను ఆధునికరించే బాధ్యతలను తాము తీసుకున్నట్లు చెప్పారు. శనివారం నగరంలోని 12వ డివిజన్ లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆయన అబ్జర్వర్లు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, లక్ష్మీనారాయణలతో కలిసి ఇంటింటికి వెళ్లి ఏడాది కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. గత ఐదేళ్లలో మా ఇంటి వద్దకు ఏ నాయకుడు రాలేదని.. మా సమస్యల గురించి పట్టించుకోలేదన్నారు. తొలిసారి మా ఇంటి వద్దకు వచ్చి పలకరిస్తున్నారంటూ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నారని ఇప్పటికే మెగా డీఎస్సీ, అన్నా క్యాంటీన్ లు, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇచ్చారన్నారు. మంత్రి నారా లోకేష్ ప్రత్యేకంగా చొరవ తీసుకొని పాఠశాలల ప్రారంభం రోజే తల్లికి వందనం పథకాన్ని ఇచ్చారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గతంలో చేసిన అప్పులను చెల్లిస్తూ ఏడాదిలోని అభివృద్ధి వైపు నడిపిస్తున్నారన్నారు. ఏడాదిలోనే 9.50 లక్షల కోట్ల పెట్టుబడులు, 8.50 లక్షల ఉద్యోగాలు ఇచ్చారన్నారు. గతంలో అమరావతితో మూడు ముక్కల ఆటాడుకున్నారని విమర్శలు చేశారు. ఇప్పుడు 40 వేల కోట్లతో అభివృద్ధి చేస్తున్నారన్నారు. 2027 కల్లా పోలవరం నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. అనంతపురం నగరంలో తొలి ఏడాదిలోనే 118 కోట్ల రూపాయలతో అభివృద్ధి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో 12వ డివిజన్ కార్పొరేటర్ జనబలం బాబా, 12 వ డివిజన్ నాయకులు మాజీ కార్పొరేటర్ రంగాచారి, టిడిపి సీనియర్ నాయకులు గడ్డం సుబ్రహ్మణ్యం, సింగవరం రవి, అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కోనంకి గంగారామ్,కార్పొరేటర్ బాలాంజినేయులు, పలు కార్పొరేషన్ డైరెక్టర్లు పి ఎల్ ఎన్ మూర్తి, పరమేశ్వర్, కడియాల కొండన్న, తెలుగు యువత జిల్లా, రాష్ట్ర నాయకులు, టిడిపి మైనార్టీ సెల్ రాష్ట్ర, తెలుగుమహిళ, టిఎన్టియుసి తదితర విభాగాల నాయకులు, డీలర్ల సంఘం నాయకులు, మాజీ కార్పొరేటర్లు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# స.హ. చట్టం వజ్రాయుధం

### -సమాచార హక్కు చట్టం పై అవగాహన సదస్సు

### -ఘనంగా కార్గిల్ విజయ్ దినోత్సవం




ప్రజాభూమి, హిందూపురం టౌన్

స్థానిక ఎన్.ఎస్.పి.ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్, రాజనీతి శాస్త్ర విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టంపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. రాష్ట్ర ఉన్నత విద్యా కమిషనర్ ఆదేశాల మేరకు కళాశాలలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు కళాశాల వైస్ ప్రిన్సిపల్ జి.వెంకటేశు లు హాజరై ప్రసంగించారు. 2005 వ సంవత్సరంలో సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన సమాచార హక్కు చట్టం 20 సంవత్సరాల పూర్తి చేసుకున్న తరుణంలో విద్యార్థి యువతకు స.హ చట్టంపై అవగాహన కల్పించేందుకు వివిధ రకాల పోటీలు నిర్వహించనున్నామన్నారు.పారదర్శకత, జవాబుతారీతనం అనే రెండు పునాదులపై ఏర్పాటు చేసిన స. హ చట్టం ప్రజలకు ఎంతో మేలు కలిగిస్తోందన్నారు. కళాశాల సీనియర్ అసిస్టెంట్ బి. నరసింహులు మాట్లాడుతూ, అప్పీలు దారుడు, స.హ.చట్టం ద్వారా కోరిన సమాచారాన్ని సంబంధిత అధికారులు నిర్ణీత గడువులోగా ఇవ్వాల్సి ఉంటుందన్నారు. అయితే స.హ.చట్టం పరిధిలోకి రాని సమాచారం పట్ల అప్పీలు దారులకు పూర్తిగా అవగాహన ఉండాలన్నారు. ప్రజల చేతిలో వజ్రాయుధంగా పనిచేసే స.హ.చటాన్ని దుర్వినియోగం కాకుండా చూసే బాధ్యత విద్యార్థి, యువతదే అన్నారు. తదనంతరం " దేశం కోసం ప్రాణ త్యాగం చేస్తూ పాకిస్థాన్ పై విజయం సాధించిన సైనికులకు నివాళులర్పించి " కార్గిల్ విజయ్ దివాస్" ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజనీతి శాస్త్ర అధ్యాపకులు డా. రవి నాయక్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రంగనాయకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉపాధి అవకాశాలను పెంపొందించుకోవాలి

### -90 రోజులు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు



ప్రజాభూమి, హిందూపురం టౌన్

మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను పెంపొందించుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలని మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్ పేర్కొన్నారు.హిందూపురం పట్టణంలో సూగూరులో ఏర్పాటు చేసిన కుట్టు మిషన్ శిక్షణా కేంద్రంలో 72 మంది మహిళలు 90 రోజులు పూర్తి చేసుకొన్న సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాల్గొని మాట్లాడారు. హిందూపురం శాసన సభ్యులు నందమూరి బాలకృష్ణ మహిళలకు ప్రత్యేకంగా 5000 కుట్టు మిషన్ లను దాదాపుగా 10 శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేయించడం జరిగిందన్నారు. ప్రస్తుతం సూగూరులో కుట్టు మిషన్ శిక్షణా కేంద్రంలో శిక్షణ పొందుతున్న మహిళలు 90 రోజులు పూర్తి చేసుకున్నారని, వీరందరికీ త్వరలోనే సర్టిఫికెట్ల ను ఎంఎల్ఏ చేతుల మీదుగా అందజేయడం జరుగుతుందన్నారు. ఈ శిక్షణ ద్వారా పేద ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పడడంతో పాటు ఉపాధి కల్పనతో కుటుంబ ఆదాయం, మహిళల్లో ఆత్మ స్థైర్యం పెరుగుతుందని తెలిపారు. ఇలాంటి శిక్షణా తరగతులను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కురుబ కార్పోరేషన్ డైరెక్టర్ పరిమళ, రాష్ట్ర అంగన్వాడీ కార్యదర్శి వెంకట లక్ష్మి, జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి, వార్డు ఇంచార్జ్ హనుమంతు, మోదా శివ, టీఎంసీ గంగులయ్య, మెప్మా సీఓలు, ఆర్పీలు, మహిళలు పాల్గొన్నారు.

# కళాశాలకు రహదారి చూపాలంటూ ఆందోళన

ప్రజాభూమి, ముదిగుబ్బ



ముదిగుబ్బ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు రహదారి చూపాలంటూ ఆ కళాశాల విద్యార్థులు శనివారం ఆందోళన నిర్వహించారు. ముదిగుబ్బలో వెళ్లే జాతీయ రహదారి 42 నుండి హైదరాబాదు - బెంగళూరు హైవేలోకి కలిపే జాతీయ రహదారి 342 నిర్మాణంతో తమ కళాశాలకు ఉన్న రోడ్డు కోల్పోయామని విద్యార్థులు అధ్యాపక సిబ్బంది ఆందోళన నిర్వహిస్తూ పనులు చేస్తున్న యంత్రాలను అడ్డుకున్నారు. అనంతరం ఎన్టీఆర్ సర్కిల్ కు చేరుకొని మానవహారంగా ఏర్పడి అరగంట పాటు వాహన రాకపోకలను అడ్డుకున్నారుఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. జాతీయ రహదారి కళాశాల గేటు ముందరే 50 అడుగుల లోతులో వెళ్తోందని దీంతో తమ కళాశాలకు వెళ్లే రహదారి పూర్తిగా కోల్పోయామని తెలిపారు. వెంటనే తమకు ఉన్నచోటే బ్రిడ్జి కానీ, శాశ్వత రహదారి గానీ చూపించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న తహసిల్దార్ నారాయణస్వామి మంగళవారం లోపు పరిష్కారం చూపుతామని కళాశాల అధ్యాపకులకు హామీ ఇచ్చారు.

# మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోండి

- ఈనెల 28న కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహణ
- జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి : ఇంచార్జి జిల్లా కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ

ప్రజాభూమి, అనంతపురము



"మీ కోసం కాల్ సెంటర్ 1100" సేవలను ప్రజలు వినియోగించుకోవాలని ఇంచార్జి జిల్లా కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్కు కాల్ చేయవచ్చునన్నారు. అర్జీదారులు వారి అర్జీలు నమోదు చేసుకోవడానికి మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్ (Meekosam.ap.gov.in) వెబ్సైట్ నందు అర్జీలు నమోదు చేసుకోవచ్చన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని ఇంచార్జి జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

28న కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహణ

ఈనెల 28వ తేదీన సోమవారం అనంతపురం కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఇంచార్జి జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లోని రెవెన్యూ భవనంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ వివరాలతో పాటు వారి సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేయాలన్నారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు. సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్ కి మెసేజ్ వస్తుందని, అర్జీదారులు వారి ఫోన్ ను చెక్ చేసుకోవాలన్నారు. నోటీసులు, ఎండార్స్మెంట్ ను వాట్సఅప్ లో పంపిస్తున్నామని, ఎండార్స్మెంట్ బై రిజిస్టర్ పోస్ట్ మీరు ఇస్తున్న అడ్రస్ కు పంపిస్తున్నామన్నారు. అర్జీ ఇచ్చేటప్పుడు దానిని కరెక్ట్ గా దానిని పూరించాలన్నారు. రిపీటెడ్ అర్జీదారులు పాత రసీదును తీసుకు రావాలన్నారు. జిల్లా ప్రజలు పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

